క్లుప్తంగా

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చెరుకుపల్లి: కావూరు ప్రభుత్వ కళాశాల, పాఠశాలల్లో 1969 నుంచి 2023 వరకు వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఒకే వేదిక మీద చేరేందుకు.. శుక్రవారం ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యుడు పిట్టు శ్రీనివాసరెడ్డి గురువారం తెలిపారు. కావూరు కళాశాలలో పూర్వ విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రంగాలలో రాణించిన వారిని సత్కరించుకోవటం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి అందరు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి కమిటీ సభ్యులు రావూరి ఆంజనేయులు, బొనిగల విజయ్‌కుమార్, పీటా ప్రసాద్ తదితరులు తెలిపారు.

మొబైల్ ఆధార్ సేవలు

చుండూరు(భట్టిప్రోలు): చుండూరు మండలం చిన పరిమి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం మొబైల్ ఆధార్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంప్‌లో ఐదు బయోమెట్రిక్, 8 మ్యాండిటర్ బయో మెట్రిక్, మొబైల్ నంబర్, చిరునామా సవరణ 25, మొత్తం 40 సర్వీసులు అందించారు. సచివాలయ డీఏ ఎ.కీర్తన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం క్యాంప్ కొనసాగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇంటికే రేషన్ బియ్యం అందించాలి

కొల్లిపర: రేషన్ పంపిణీ వాహనాల ద్వారా ప్రతి ఇంటికి రేషన్ బియ్యం సక్రమంగా అందజేయాలని తహసీల్దారు జి.నాంచారయ్య సిబ్బందిని ఆదేశించారు. మండలంలో పలు గ్రామాలల్లో ఎండీయూ ద్వారా చేపట్టిన రేషన్ పంపిణీని ఆయన గురువారం పరిశీలించారు. ప్రతి నెలా సరుకుల పంపిణీ తీరును రేషన్ కార్డుదారులను అడిగి తెలుసుకున్నారు. వాహన నిర్వహణపై ఆపరేటర్లకు అవగాహన కల్పించారు. కార్డుదారుల నుంచి ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

తిరునాళ్ల నిర్వహణపై సమీక్ష నేడు

రేపల్లె రూరల్: మహా శివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని అరవపల్లిలో వేంచేసి యున్న బాలకోటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే తిరునాళ్ల ఏర్పాట్లకు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో పి.రాజేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తహసీల్దార్ మల్లికార్జునరావు అధ్యక్షత వహిస్తారని, నిర్వహించే సమావేశంలో ఆయా శాఖల అధికారులు పాల్గొనాలని పేర్కొన్నారు.

వీర్లంకమ్మకు ప్రత్యేక పూజలు

కర్లపాలెం: మండలంలోని పెదపులుగు గ్రామంలో వీర్లంకమ్మ అమ్మవారికి నూతనంగా నిర్మించనున్న ఆలయం వద్ద గురువారం విశేష పూజలు జరిగాయి. వేద పండితులు మంత్రోచ్ఛరణలతో యజ్ఞం నిర్వహించారు. యంత్ర స్థాపన పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో చిన అక్కలవారి వంశస్థులు పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సచివాలయ సేవలను సద్వినియోగం చేసుకోండి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ సువార్త

పిట్టలవానిపాలెం: గ్రామ సచివాలయాల్లో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని బాపట్ల డీఎల్‌డీఓ చంద్ర సువార్త సూచించారు. మండలంలోని కోమలి గ్రామ సచివాలయాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయంలో అందిస్తున్న సేవలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు.

దొరస్వామి మృతికి ఎంపీ సంతాపం

రేపల్లె రూరల్: తుమ్మల గ్రామానికి చెందిన గరికపాటి వెంకట నారాయణ దొరస్వామి(92) గురువారం ఆకస్మిక మృతి చెందారు. ఆయన తుమ్మల గ్రామానికి సర్పంచ్‌గా 30 ఏళ్లు సేవలందించారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడిగా, జడ్పీటీసీగా పనిచేశారు. బార్ అసోసియేషన్ సభ్యుడిగా ఉన్నారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ రేపల్లె పట్టణంలోని ఆయన స్వగృహంలో కన్నుమూశారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు ఆయన మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి వ్యక్తం చేశారు. నాయకులు గరికపాటి భానుకోటి, కొమ్మూరి వీరబ్రహ్మేంద్రస్వామి, అల్లంశెట్టి శ్రీనివాసరావు, షేక్ సుభాని ఆయన వెంట ఉన్నారు.

బాలికా విద్యకు ప్రాధాన్యం

'గడప గడపకు' కార్యక్రమంలో మంత్రి మేరుగ నాగార్జున



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

ఇంటూరు(వేమూరు): బాలికా విద్య ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. అమృతలూరు మండలం ఇంటూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆయన గురువారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా వంటి కార్యక్రమాలతో.. ప్రతి బాలికను చదవించాలనేది సీఎం వైఎస్ జగన్ ధ్యేయమన్నారు. కల్యాణమస్తు పథకం ద్వారా గత ప్రభుత్వం ఎస్సీలకు రూ.40 వేలు ఇస్తే.. ప్రస్తుతం రూ.లక్ష చేసినట్లు వెల్లడించారు. ఎస్సీల కులాంతర వివాహాలకు ఇచ్చే నగదు రూ.75 వేల నుంచి రూ.1,20,000లకు పెంచినట్లు తెలిపారు. ఇలా కులాంతర వివాహాలకు ఇచ్చే నగదును సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెంచి, న్యాయం చేశారని తెలిపారు. ఎంపీపీ రాపర్ల నరేంద్ర, గ్రామ సర్పంచ్ మద్దు జీవ మణి, వీరభద్ర శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీలు తమ్మ వెంకట రెడ్డి, కె.ఆనంద్ కుమార్, మాజీ సర్పంచ్ బట్టు మోషే, లీగల్ సెల్ నాయకుడు గుమ్మడి రవిరాజా, కాజా శంకర్‌రెడ్డి, రాఘవరెడ్డి, మాజీ సర్పంచ్ కమ్మ సామియేలు, అవుతు ముత్తరెడ్డి, సాహిత్య అకాడమి డైరెక్టర్ ఓలేటి శివాజీ, కారుమూరి వెంకట రెడ్డియ్య, మార్కెట్ యార్డు చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

'గడప గడపకు' మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంపీ మోపిదేవి



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు

నిజాంపట్నం: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు పేర్కొన్నారు. మండలంలోని కొత్తపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మోపిదేవి మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో సంక్షేమ పథకాల ద్వారా సుమారు రూ.25 కోట్ల నగదు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యిందన్నారు. కోటి రూపాయల నిధులతో రోడ్ల నిర్మాణాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి మరొకసారి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ప్రతి పక్ష పార్టీలు రోజుకోక బూటకపు మాటలు ఎన్ని చెప్పినా ప్రజలు వాటిని వినే పరిస్థితుల్లో లేరని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కొత్తపాలెం గ్రామ ప్రజలు ఎంపీ మోపిదేవికి ఘనస్వాగతం పలికారు. ప్రతి ఇంటికీ వెళ్లి.. పథకాల లబ్ధిని తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొక్కిలిగడ్డ రవి, జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల హరనాథబాబు, ఎంపీటీసీలు గోపాలకృష్ణ, లంకె శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ రామాని కోటేశ్వరరావు, ఎంపీడీఓ నాగలక్ష్మి, తహసీల్దారు శిరీష, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాలలతో పనిచేయిస్తే.. కఠిన చర్యలు



ఇటుక బట్టీలో కూలీలకు అవగాహన కల్పిస్తున్న సీఐ, తహసీల్దారు

కొల్లూరు: ఇటుక బట్టీలు, ఇతర వాణిజ్య కేంద్రాల్లో చిన్నారులతో పనులు చేయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వేమూరు సీఐ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. గురువారం మండలంలోని ఇటుక పరిశ్రమలను పోలీసు, రెవెన్యూ, ఐసీడీఎస్ శాఖల అధికారులతో కలసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గాజుల్లంక ప్రాంతంలో ఇటుక బట్టీలలో పనిచేస్తున్న ఐదుగురు బాల కార్మికులను గుర్తించారు. వారిని కొల్లూరు పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. బాలలతో పనులు చేయించిన పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని బట్టీల యజమానులను హెచ్చరించారు. ఇటుక పరిశ్రమలను ఇక్కపై తరచూ తనిఖీ చేస్తామని పిల్లలను పనిలో పెట్టినట్టైయితే.. కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. చిన్నారులను పనిలో పెట్టమని లిఖిత పూర్వక ఆమోదాలను వారి నుంచి ఐసీడీఎస్ సిబ్బంది తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు, ఎస్ఐ శామ్యూల్ రాజీవ్ కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మాధవి, నగరాజకుమారి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

వ్యవసాయ ఇంజినీరింగ్‌కు మంచి భవిష్యత్తు ఉంది



అవగాహన కల్పిస్తున్న డాక్టరు హరిబాబు

బాపట్ల: వ్యవసాయ ఇంజినీరింగ్ విద్యకు మంచి భవిష్యత్ ఉందని కళాశాల అధ్యాపకులు డాక్టరు బి.హరిబాబు పేర్కొన్నారు. వ్యవసాయ ఇంజినీరింగ్ విద్యపై గురువారం స్థానిక వీజీఆర్ఎం కళాశాలలో విద్యార్థులకు అవగాహన తరగతులు నిర్వహించారు. కోర్సును అభ్యసించిన విద్యార్థులకి మంచి అవకాశాలు ఉంటాయని, విదేశీ విద్యకు చక్కని మార్గమని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రొగ్రాం అధికారి లావణ్య లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఏప్రిల్ 5న ఛలో ఢిల్లీ

తెనాలి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న ఛలో ఢిల్లీకి తరలిరావాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి మంచికలపూడి సాంబశివరావు పిలుపునిచ్చారు. గురువారం చెంచుపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో కోలనీడి రవికుమార్ అధ్యక్షతన రైతు, కార్మిక సదస్సును నిర్వహించారు. సాంబశివరావు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు, నెలకు రూ.10 వేలు పింఛను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయడం దుర్మార్గమన్నారు. కార్మిక, కర్షక ఐక్యతతోనే కేంద్ర ప్రభుత్వం మెడలు వంచ గలుగుతామన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివ సాంబిరెడ్డి మాట్లాడుతూ పంటలకు కనీస మద్దతు ధర గ్యారెంటీ చట్టం చేయాలని, డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని, కేరళ తరహా రుణ విమోచన చట్టం చేయాలనేది ఛలో ఢిల్లీ కార్యక్రమం డిమాండ్లుగా చెప్పారు. షేక్ హుస్సేన్‌వలి, ముద్దన సాంబశివరావు, ములకా శివకుమారి, జి.వెంకటసుబ్బయ్య, రాచూరి వెంకటేశ్వర్లు, దేవళ్ల శ్రీను పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- పెరటి కోళ్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కోన రఘుపతి
- బాపట్లలో పర్యాటక అభివృద్ధిపై మంత్రి రోజాకు వినతి



మహిళలకు పెరటి కోళ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి, పక్కన నాయకులు

బాపట్ల అర్బన్ : మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు ఎమ్మెల్యే కోన రఘుపతి మహిళలకు పెరటికోళ్ల (అసిల్ బ్రీడ్)ను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడారు. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనే పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. మహిళల అదనపు ఆదాయం కోసం ఏడాదికి 60 నుంచి 140 గుడ్లు పెట్టే అసీల్ జాతి కోళ్లు 12 (9 పెట్టలు 3 పుంజులు), 50 కేజీల దాణా, మందులతో కూడిన యూనిట్‌ను రూ.4,800లకు అందిస్తున్నట్లు వెల్లడించారు. పార్టీ మండల కన్వీనర్ కె.రాఘవరెడ్డి, ఏపీఎం డి.సురేష్, సీసీలు కె.ప్రకాష్, ఎస్.శివరామ్‌ప్రసాద్,

● పిట్టలవానిపాలెం మండలంలోని అలకాపురం గ్రామంలో డ్వాక్రా మహిళలకు గురువారం పెరటికోళ్లను ఎమ్మెల్యే కోన రఘుపతి పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 100 యూనిట్లు అందిస్తున్నట్లు ఏపీఎం సంతోష్ కుమార్ తెలిపారు.

● కర్లపాలెంలో ఎమ్మెల్యే కోన రఘుపతి డ్వాక్రా సంఘాల మహిళలకు గురువారం పెరటి కోళ్లు పంపిణీ చేశారు. మండలంలో మహిళలకు 100యూనిట్ల పెరటికోళ్లు పంపిణీ చేస్తున్నామని ఏపీఎం శ్రీనివాసులురెడ్డి తెలిపారు. పార్టీ మండలాధ్యక్షుడు డి.సీతారామిరెడ్డి, ఎంపీపీ యారం వనజ, వైస్ ఎంపీపీ పి.సుబ్బారావు, మండల సమాఖ్య అధ్యక్షులు సీహెచ్ ధనలక్ష్మి, ఎంపీటీసీలు తాంద్ర సాంబశివరావు, ఆసిఫ్ అలీ, నాయకులు పాల్గొన్నారు.

బాపట్లకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి

బాపట్ల: పర్యాటకంగా బాపట్ల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజాను బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి కోరారు. సూర్యలంక తీరాన్ని పరిశీలించేందుకు బాపట్లకు చేరుకున్న మంత్రిని ఆయన మార్యద పూర్వకంగా కలిశారు. సూర్యలంక బీచ్ అభివృద్ధికి సమీక్షించారు. బాపట్లను టెంపుల్ టౌన్‌గా తీర్చిదిద్దేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాల్సిందిగా సూచించారు.

పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం అందజేస్తున్న నిర్వాహకులు

భట్టిప్రోలు: సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ (పీఎంఎస్ఎంఏ) కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు గురువారం పౌష్టికాహారం అందజేశారు. మండలి కన్వీనర్ మానేపల్లి సుబ్బారావు మాట్లాడుతూ 50 మందికి వేరుశనగ ఉండలు, ఎండు ఖర్జూరం, హార్లిక్స్ ప్యాకెట్లు, రొట్టె, అరటి పండ్లుతో కూడిన కిట్లను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్మాసిస్ట్ బూర్లె కన్యకాదేవి, మండలి నిర్వాహకులు దివి రామకృష్ణ, మానేపల్లి సాయిగణేష్ కుమార్, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాక్టర్లు సీజ్

కొల్లూరు: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసిన ఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పెసర్లంక నదీ పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సెబ్ అధికారులు కొల్లూరు లాక్ సెంటర్ ప్రాంతంలో నిలువరించి, కొల్లూరు పోలీసు స్టేషన్‌కు తరలించారు. వేమూరు సెబ్ ఎస్ఐ రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శామ్యూల్ రాజీవ్‌కుమార్ తెలిపారు.

12న సినీ సంగీత విభావరి

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో కళాసౌధ ఆధ్వర్యంలో ఈనెల 12న సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు బి.వేదయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేదనాదం పుస్తకావిష్కరణ అనంతరం సూపర్‌స్టార్ కృష్ణ నటించిన చిత్రాల్లోని పాటలతో సంగీత విభావరి జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంగీత అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

రెడ్‌క్రాస్ సేవలు ఎనలేనివి



వైద్యశాల ఆవరణంలో మహిళలకు పండ్లు, రొట్టెల పంపిణీ

రేపల్లె: తీరంలో ప్రజలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు అందిస్తున్న సేవలు ఎనలేనివని రేపల్లె కమ్యూనిటీ వైద్యశాల మెడికల్ ఆఫీసర్ జేవీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక వైద్యశాలలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో విజయవాడ అనుమై జేబీ ఆసుపత్రి సిబ్బంది గురువారం తల్లి, బిడ్డల ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు బాషా, మణి 60 మంది బాలింతలు, గర్భిణీలు, 22 మంది చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. శిబిరంలో రేపల్లె సత్యసాయి సేవా సమితి సభ్యులు ఉచితంగా పండ్లు, రొట్టెలు, బిస్కెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ అనిల్ కుమార్, రెడ్‌క్రాస్ రేపల్లె సబ్ డిస్ట్రిక్ బ్రాంచ్ కార్యనిర్వాహక కమిటీ సభ్యులు అడుసుమల్లి ప్రభాకరరావు, సయ్యద్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

గణపతి స్వామికి 16 రోజుల పండుగ



వెల్లటూరు(భట్టిప్రోలు): మండలంలోని వెల్లటూరు గ్రామంలో కొలువైన సిద్ది బుద్ది సమేత గణపతి స్వామి వార్ల కల్యాణ మహోత్సవాలలో భాగంగా గురువారం 16 రోజుల పండుగ, సంకట హర చతుర్థి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చందూ మాస్టార్ పూజా కార్యక్రమాలను శాస్త్రయుక్తంగా జరిపారు. స్వామి కల్యాణ మహోత్సవాలే వెల్లటూరు తిరునాళ్లగా ప్రసిద్ధి గాంచాయి. ప్రతి నెలా పౌర్ణమి తరువాత వచ్చే చతుర్థి పురస్కరించుకుని పూజలు జరుగుతాయి. సంకట హర చతుర్థి అంటే మనుషుల కష్టాల నుంచి గట్టెక్కించేది అని అర్థం.. విఘ్నాలు తొలగించే గణపతికి అత్యంత ప్రీతి పాత్రమైన తిధులలో ప్రధానమైనదని వేద బ్రాహ్మణులు తెలిపారు. భక్తులు స్వామి వార్లను దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

తెనాలిరూరల్: రైస్ మిల్లులో అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వ చేశారన్న సమాచారంతో పోలీసులు గురువారం తనిఖీ చేశారు. పట్టణ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ఓ మిల్లులో రేషన్ బియ్యంతో బియ్యం రవ్వ, బియ్యప్పిండి చేస్తున్నారన్న పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందింది. వారి ఆదేశాల మేరకు త్రీ టౌన్ పోలీసులు మిల్లుపై ఆకస్మిక తనిఖీలకు వెళ్లారు. 18 బస్తాల్లో బియ్యం రవ్వ, 10 బస్తాల్లో బియ్యప్పిండి, 30 బస్తాల్లో ఉంచిన బియ్యం, మిల్లులో మరి కొంత బియ్యాన్ని గుర్తించారు. 805 కిలోల బియ్యం రేషన్ బియ్యంగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని సివిల్ సప్లయీస్ అధికారులకు అప్పగించనున్నట్లు పోలీసులు తెలిపారు.

సంక్షేమ ఫలాలతో.. ప్రతి ఇంటా సంతోషం

'గడప గడపకు' కార్యక్రమంలో ఎమ్మెల్యే కోన రఘుపతి



మండేవారిపాలెంలో సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

పిట్టలవానిపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. అల్లూరు గ్రామ సచివాలయం పరిధిలోని అలకాపురం గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సర్పంచ్ మంతెన గంగరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి మండే విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన ప్రతి ఇంటికీ వెళ్లారు. సంక్షేమ పథకాల అమలును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. గడప గడపకు కార్యక్రమంలో అపూర్వ స్వాగతం లభిస్తోందన్నారు. గతంలో రాజకీయ నాయకుడు వస్తున్నాడంటే సమస్యలు స్వాగతం పలికేవని, ఇప్పుడు సంక్షేమ ఫలాలతో ప్రతి కుటుంబం కళకళలాడుతూ కనిపిస్తోందన్నారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ఈ సందర్భంగా ప్రారంభించారు. అలకాపురం శివారు మండేవారిపాలెం నుంచి ప్రారంభించి అలకాపురం, సత్యనారాయణపురం గ్రామాల్లో గడప గడపకు తిరిగారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ షేక్ బాజి, వైస్ ఎంపీపీలు దెందుకూరి సీతారామ రాజు, చేబ్రోలు కృపానందం పార్టీ నాయకులు గోవతోటి విజయ్, ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ అహ్మద్ హుస్సేన్, స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు కత్తి కుమారి, పార్టీ నాయకులు వాలిశివారెడ్డి, చేబ్రోలు వీరయ్య, చేబ్రోలు రవికుమార్, శ్యామల నాగిరెడ్డి, బొలగాని సుబ్బారావు, దబ్బకూటి మాధవరావు, ఎంపీటీసీలు కూసంపూడి దేవేంద్రరాజు, డి.కోటిరెడ్డి, మన్నెం శివకేశవులు, పారె ధనుంజయ యాదవ్, కుంతం ప్రసన్నరాజు, యేహోను, గుమ్మడి సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి



అంగన్ వాడీ కేంద్రంలో మండల ప్రత్యేక అధికారిణి బాలమ్మ

చెరుకుపల్లి: ప్రతి గ్రామ సచివాలయానికి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించి, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మండల ప్రత్యేకాధికారి పి.బాలమ్మ స్పష్టం చేశారు. గురువారం మండలంలోని చెరుకుపల్లి–2 సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. సచివాలయంలో రికార్డులు పరిశీలించారు. అదేవిదంగా తహసీల్దారు ప్రశాంతి ఆరుంబాక సచివాలయాన్ని, ఎంపీడీఓ శ్రీనివాసరావు బలుసులపాలెం సచివాలయాన్ని తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్ కేవీ సుబ్బమ్మ, ఈఓపీఆర్డీ మురళీ, అంగన్‌వాడీ కార్యకర్త శైలజ, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అఖండ జ్యోతుల మహా యజ్ఞం ప్రారంభం



పూజలో పాల్గొన్న రామ్‌జీ బాబా దంపతులు, భక్తులు

పెదపులివర్రు(భట్టిప్రోలు): మండలంలోని పెద పులివర్రులోని షిర్డీ సాయిబాబా మందిరంలో 108 నామాల అఖండ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. నిర్వాహకులు గొర్రిపాటి హరిబాబు, బాల త్రిపురసుందరి దంపతులు పూజలు చేశారు. సాయిబాబా జీవిత సచ్చరిత్ర పారాయణం 49 రోజుల పాటు జరుగుతుందని వారు తెలిపారు. అఖండ జ్యోతి కార్యనిర్వాహకులు రామ్‌జీ బాబా (బొబ్బా భోగేశ్వరరావు) మాట్లాడుతూ.. ఈ బృహత్తర కార్యక్రమాన్ని 108 గృహాల్లో లేదా దేవాలయాల్లో చేస్తే ఫలితం ఉంటుందని పేర్కొన్నారు. మార్చి 30న పూర్ణాహుతితో కార్యక్రమం ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మస్తాన్‌షా ఉరుసు మహోత్సవాలు

పాత గుంటూరు: గుంటూరు జీటీ రోడ్డులోని హజరత్ కాలేమస్తాన్‌షా అవులియా ఉరుసు మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దర్గా ధర్మకర్త రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో బుధవారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమైన గంధం మహోత్సవం నగర ప్రధాన వీధుల్లో కొనసాగుతూ గురువారం ఉదయం 10 గంటల వరకు ఘనంగా నిర్వహించారు. విశేష సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు. బాబా దర్శనానికి వస్తున్న భక్తుల సౌకర్యార్థం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మధ్యాహ్నం, సాయంత్రం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 4 గంటలకు గంధ పంపిణీ, దీపారాధన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగర ప్రముఖులు, భక్తులు విశేష సంఖ్యలో బాబా సమాధిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.